క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ: తాడికొండ 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని మోతకడ, నిడుముక్కల, గుడిపూడి, రావెల, పాములపాడు, బేజాత్‌పురం, ముక్కామల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

తెలుగులో తీర్పు

మంగళగిరి: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు అచ్చ తెలుగులో తీర్పు వెలువరించి అందరి మన్ననలు పొందారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో లింగాయపాలెంకు చెందిన ప్రశాంత్‌పై ఇసుక చోరీ కేసు నమోదు కాగా కోర్టులో విచారణ జరిగింది. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి తీర్పును తెలుగులో వెలువరించారు.

గొడవర్రులో పొలంబడి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రులో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష రైతులకు వేప గింజల కషాయం తయారీ, ఉపయోగాలను వివరించారు. వరి సాగులో చేపట్టాల్సిన చర్యలను విశదీకరించారు. కార్యక్రమాన్ని ఏడీఏ ఎన్.ఉషారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, వీఏఏ పవన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులవృత్తుల ఉన్నతికి కృషి చేయాలి

మంగళగిరి: కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు బీసీ కులవృత్తుల ఉన్నతికి కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కార్యాలయంలో మాట్లాడుతూ రజక, నాయీబ్రాహ్మణ, కుమ్మరి, నేత, గీత వంటి సామాజిక సేవా వృత్తులు నిర్వహించే వారికి సహకారం అందించాలన్నారు. వారికి ఆధునిక పరికరాలు అందించడంతోపాటు సబ్సిడీలు ఇచ్చి ఉపాధిని మెరుగు పరచాలని కోరారు.

సీఐగా రవీంద్రబాబు బాధ్యతల స్వీకరణ



ఫిరంగిపురం: సీఐగా బి.రవీంద్రబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వీరేంద్రబాబు బదిలీపై వెళ్లారు. ఏసీబీలో విధులు నిర్వహిస్తున్న రవీంద్రబాబు బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. మండల అర్చక సంఘ నాయకులు స్థానిక పోలీసుస్టేషన్‌లో రవీంద్రబాబుకు శాలువా కప్పి సన్మానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దివి వరప్రసన్న మూర్తి, పూర్ణనందశాస్త్రి, రాజేంద్రశర్మ, వినయ్ పాల్గొన్నారు.

గేట్‌లో అర్హత సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగావకాశాలు



తాడికొండ: 'గేట్ పరీక్షల్లో అర్హత సాధిస్తే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, గేట్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీల్లో పీజీ చేసేందుకు అవకాశం ఉందని సంధ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఎండీ రామారావు అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 'గేట్ పరీక్ష విధానం, అవకాశాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గేట్ పరీక్ష విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, ఆర్ అండ్ డీన్ డాక్టర్ బాలమురళీకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెస్ట్ ట్రాఫిక్ సీఐగా సింగయ్య

పట్నంబజారు: గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐగా సిహెచ్.సింగయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కి చెందిన ఆయన పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది సీఐగా పదోన్నతి లభించింది. బాపట్ల జిల్లాలో కొద్ది కాలం విధులు నిర్వర్తించిన ఆయన్ని గుంటూరు వెస్ట్ ట్రాఫిక్‌కు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

వ్యక్తిపై దాడి

పట్నంబజారు: డబ్బులు ఇవ్వలేదని వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన గుంటూరులో జరిగింది. మోతీలాల్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ బాషా ఈనెల 29న రాత్రి నెహ్రూ నగర్ ఒకటో లైన్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వచ్చి డబ్బులు ఎంత ఉన్నాయో ఇవ్వాలంటూ బెదిరించారు. డబ్బులు లేవని చెప్పిన బాషాను కొట్టి గాయపరిచారు.

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయి చేసుకోవడం ఎంత నేరమో అలాగే విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడి చేయడం అంతే. అమర్యాదగా మాట్లాడే వారిని కఠినంగా శిక్షించాలి. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. వైద్యులంటే ప్రాణ రక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం ఉండాలి.

ఎ.విమలమ్మ, ఏఎన్ఎం, దొప్పలపూడి



వైద్యశాలల్లో మహిళలకు రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జరిగిన లాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృత్తం కాకుండా మహిళా వైద్యులు, సిబ్బందికి సరైన రక్షణ కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యుల రక్షణకు బలమైన రక్షణ చట్టాలు తీసుకురావాలి. నిరంతరం రోగులకు సేవలందించే మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే విధులు నిర్వర్తించడం కష్టతరమవుతోంది.

– ఎ.రాణిమ్మ, ఏఎన్ఎం దండమూడి

ప్రకృతికి 'మొక్కేద్దాం'



తాడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోస్తున్న డీసీఓ పద్మజ



దుగ్గిరాలలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ బాణావత్ కుషీభాయి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు

- ఊరూవాడా వన మహోత్సవం
- ఉత్సాహంగా మొక్కలు నాటిన వైనం
- భాగస్వాములైన ప్రైవేటు సంస్థలు

తాడికొండ/తాడేపల్లిరూరల్/ఫిరంగిపురం: తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో శుక్రవారం వన మహోత్సవం ఉత్సాహంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మొక్కలను నాటారు. వాటిని పరిరక్షించి, ప్రకృతిని కాపాడతామని ప్రతినబూనారు. తాడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన వన మహోత్సవంలో జిల్లా సహకారశాఖ అధికారి(డీసీఓ) కె.పద్మజ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. అందరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మరియదాసు, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు బండ్ల కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- తాడికొండ బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీతా లక్ష్మి మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.
- ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరులో జరిగిన వన మహోత్సవంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నిర్మలలక్ష్మీకుమారి, కూన ఏడుకొండలు, పి.వెంకట్రావు, అంచుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- ఫిరంగిపురంలో సర్పంచ్ మేడాబాబు మొక్కలు నాటారు.
- మేరికపూడిలో సర్పంచ్ కె.పద్మావతి మొక్కలు నాటారు.
- మునగపాడు చెరువుకట్ట ప్రాంతంలో సర్పంచ్ ఎస్.వెంకటరత్నం మొక్కను నాటారు. వేములూరిపాడు గ్రామంలోని ఎస్సీకాలనీలోని పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రామంలో రోడ్లకు ఇరువైపులా 400 మొక్కలు నాటించారు.
- తాడేపల్లిరూరల్ నులకపేటలోని మదర్సాలో నిర్వహించిన కార్యక్రమంలో వక్ఫ్ సర్వే కమిషనర్ షరీన్ బేగం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాయింట్ సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ కె.ఝాన్సీరాణి, అసిస్టెంట్ సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ వి.తోయజాక్ష, గోపాలకృష్ణ, మదర్సా ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్లా, కమిటీ సిబ్బంది, వక్ఫ్ సర్వేయర్ శివనాగేశ్వరరావు, మహమ్మద్ నవీద్, సర్వే కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- దుగ్గిరాల గ్రామ పరిధిలోని పలు ప్రాంతాల్లో దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషీభాయి, ఎంపీడీఓ శ్రీనివాసరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శరత్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి రూరల్ నులకపేటలో మొక్కలు నాటుతున్న వక్ఫ్ సర్వే కమిషనర్ షరీన్ బేగం



113 తాళ్లూరులో మొక్కను నాటుతున్న ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, నాయకులు

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

తాడేపల్లిరూరల్: రాబోయే మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా చెప్పారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ముంపు నివారణ చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే 80 శాతం డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టామని వివరించారు. వర్షాలకు డ్రెయిన్లు పొంగి కల్వర్టుల వద్ద, అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గాలులకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్ల మీద పడితే తొలగించేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించినట్టు పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించామని, జనరేటర్లు అందుబాటులో ఉంచాలని చెప్పామని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటుచేశామని వివరించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆ నంబర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు.

నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నంబర్లు
08645295193
7093912653



క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన అభినందనీయం

మంగళగిరి: క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఎంతో మందిని ఉన్నత స్థానాలకు చేర్చిన వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో తానూ విద్యనభ్యసించడం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి తెలిపారు. పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల 48వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కళాశాలలో తొలిసారిగా బీఏ , బీకామ్ కంప్యూటర్ కోర్సులు ప్రారంభించారని పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోనే నియోజకవర్గ స్థాయిలో తొలి డిగ్రీ కళాశాలని గుర్తుచేశారు. క్రమశిక్షణతో విద్యను అందించి ఎంతో మందిని ఉన్నతస్థానాలకు చేర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గొడవర్తి నాగేశ్వరరావు, కరస్పాండెంట్ గోలి రామ్మోహనరావు, సీకే జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జె.పాండురంగారావు, ప్రెసిడెంగ్ వెనిగళ్ళ తాతారావు, ఇసునూరి చంద్రమోహన్, కమిటీ ప్రతినిధులు డాక్టర్ కొల్లి నాగేశ్వరరావు, దామర్ల నరసింహం, నరసింహమూర్తి, అందే రామ్మోహనరావు, జీబీ ఫ్రాంక్లిన్, నిర్మల కుమారి, ఏటీ రాయుడు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి తదితరులు

పిల్లలు, మహిళలపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్ : దేశవ్యాప్తంగా చిన్నపిల్లలు, విద్యార్థినులు, మహిళలపై దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలని రీసెర్చ్ స్కాలర్, సామాజిక ఉద్యమకారుడు, బీజేపీ నాయకులు అనుముల వంశీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వంశీకృష్ణ మాట్లాడుతూ పసిపిల్లలు, మహిళలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్లవల్లేరులోని ఇంజినీరింగ్ కాలేజీలో ఆడపిల్లల హాస్టల్ బాత్‌రూమ్‌లో హిడెన్ కెమెరాలు పెట్టి వీడియోలు చిత్రీకరించారని, ఈ రెండు నెలల్లోనే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరిగాయని వివరించారు. వీటిని ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేశారు.

బీజామృతంతో నారుశుద్ధి

ఫిరంగిపురం: మొక్కలు నాటే ముందు బీజామృతంతో మిరపనారు శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి రామచంద్రం చెప్పారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో శుక్రవారం మిర్చి పంట వేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మిర్చి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి విపులీకరించారు. కార్యక్రమంలో డీపీఎం రాజకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇ.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారి రామచంద్రం, డీపీఎం రాజకుమారి

వాహనాలు నిలపకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి

తాడికొండ: తాడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని బస్టాండ్ సెంటర్‌లోని దుకాణ సముదాయాల ముందు వాహనాలు నిలపరాదనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయాలని సీఐ కె.వాసు సూచించారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వీఐపీలు, జడ్జిలు, ఉన్నతాధికారుల రాకపోకలకు ఆటంకం కలగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా సహకరించాలని పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులకు గాంధీపార్కులో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.



దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్న సీఐ వాసు

కేఎల్‌యూకు జాతీయస్థాయి 22వ ర్యాంకు

వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయి 22వ ర్యాంక్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ దేశంలోని అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యాసంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లు రెండూ జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించాయని, ఈ అద్భుతమైన విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్, ర్యాకింగ్స్ 2024లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ ర్యాంకును కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించిందని, దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలను కలిపి ప్రకటించిన ర్యాంకులలో కేఎల్‌యూ 22వ ర్యాంక్ దక్కించుకుందని చెప్పారు. దేశంలోని మొత్తం 6,517 ఉన్నత విద్యాసంస్థలు పోటీ పడగా, తమ యూనివర్సిటీకి 22వ ర్యాంక్ లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్లేస్‌మెంట్స్ డీన్ డాక్టర్ ఎస్.బి.వి.ప్రసాద్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కొనసాగుతూనే ఉన్నాయని, ఇటీవల జరిగిన ప్లేస్‌మెంట్స్‌లో రూ.35 లక్షల వార్షిక ప్యాకేజీతో నలుగురు విద్యార్థులు పేపాల్ కంపెనీకి, నలుగురు రూ. 20 లక్షల వార్షిక ప్యాకేజీతో జేపీ మోర్గాన్ కంపెనీకి ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



22వ ర్యాంకు సాధించిన సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ

నీటి నిల్వలతోనే అనారోగ్యం



ఫిరంగిపురం: ఇంటిలో మంచినీరు నాలుగు రోజులకు మించి నిల్వ ఉండకుండా చూసుకోవాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ చెప్పారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఫిరంగిపురం, రసూల్ పేట ప్రాంతాల్లో ఆయన గృహాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మంచినీటి తొట్టిలు, నీటి కుండలు, వాటర్ ట్యాంకులలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే డెంగీ, చికున్ గున్యా, మలేరియాను కలిగించే దోమలు లార్వాలు పెరుగుతాయని చెప్పారు. ప్రతి శుక్రవారం ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఇంటింటికీ వచ్చి పరిశీలించి వారికి అవగాహన కల్పించి శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జ్వర అనుమానితులకు రక్తనమూనా పరీక్షలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయిస్తామని చెప్పారు. ఆయన వెంట సీహెచ్‌వో వెంకటరమణ, ఎంపీహెచ్ఏలు కిరణ్, విజయ్‌కుమార్, ఆరోగ్యసిబ్బంది మాబు, లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యుదయ భావాల ఉద్యమనేత నరసింహారావు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అభ్యుదయ, వామపక్ష భావాల ఉద్యమనేతగా నరసింహారావు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ సంఘ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పౌర సమాజ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీ నరసింహారావు సంస్మరణ సభను శుక్రవారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య విద్యా సంస్థల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ అధ్యాపక ఉద్యమనేతగానే కాకుండా, వామపక్ష భావజాలంతో పౌర హక్కుల సంఘ నేతగా కడదాకా జీవించిన నరసింహారావు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నమ్మిన ఆశయాల సాధన కోసం జీవితకాలం కృషి చేసిన మహనీయుడని నివాళులర్పించారు. చరిత్ర కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సోమశేఖరరావు చరిత్ర కాంగ్రెస్ ఉద్యమ నిర్మాణంలో దశాబ్దాలుగా నరసింహారావు క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ అధ్యక్షత వహించిన సభలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వైఎస్‌సీ బోస్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, సీఎస్ఆర్ ప్రసాద్, వి.లక్ష్మణరెడ్డి, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు లక్ష్మి, జ్యోతిర్మయి, సుధామయి, నరసింహారావు, అభిమానులు పాల్గొన్నారు.



నరసింహారావు సంస్మరణ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డొక్కా, శామ్యూల్ తదితరులు

ఓవరాల్ చాంపియన్ హిందూ ఫార్మసీ కళాశాల

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అంతర్ ఫార్మసీ కళాశాలల ఆటల పోటీల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ 20 ఫార్మసీ కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా, తమ కళాశాల విద్యార్థులు క్యారమ్స్, క్యారమ్స్ మిక్స్‌డ్, అంత్యాక్షరిలలో ప్రథమ స్థానంతో పాటు చెస్, డంషరాడ్స్‌లో తృతీయ స్థానంతో ఓవరాల్ చాంపియన్లుగా ఎంపికై ట్రోఫీ, నగదు బహుమతి సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.సీతారామయ్య, ఎ.ప్రత్యూష, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్‌బాబు విద్యార్థులను అభినందించారు.

దోమ కాటుతో వ్యాధులు ప్రబలుతాయి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: దోమకాటు వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం, మలేరియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శుక్రవారం దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులన్ని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ దోమల నియంత్రణకు మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇలా చేయడం వలన మీ కుటుంబంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం విషజ్వరాలు, డెంగ్యూవంటి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. దోమకాటు వలన ఇవి అని సంభవిస్తున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

వైభవంగా తూములూరులో విగ్రహ ప్రతిష్ట

తూములూరు(కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామంలోని అయోధ్యనగర్, ఎస్టీ కాలనీలో శుక్రవారం ఉదయం 11.02 నిముషాలకు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జ్యోతిష్య–వాస్తు పండితులు నారాయణం రాజా గోపాలాచార్యులు చేతులు మీదుగా వేద మంత్రాలు నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గత మూడు రోజుగా అనేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వార్లను ప్రతిష్ఠించారు. ఆలయంలో ప్రతిష్ఠ అనంతరం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి గ్రామంలో మహిళలు, చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో స్వామి వార్లలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు.

